## నిబంధనలు పాటించని 321 వాహనాలు సీజ్



నంబర్ ప్లేట్‌లేని వాహనాలను సీజ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎదులాపురం, జూలై 10 : ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలో వాహనాల స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. వారం రోజులలో నంబర్ ప్లేట్లు లేని 321 వాహనాలను సీజ్ చేశామన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌక్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని 50 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. ఒరిజినల్ రిజిస్ట్రేషన్ కార్డు ఆధారంలో నంబర్ ప్లేట్లను దగ్గరుండి ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, ఎస్ఐ మొబిన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## 15న కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల ధర్నా

ఎదులాపురం, జూలై 10 : బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను చేపడుతున్నట్లు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా నాయకుడు బీ వెంకటనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు గంగమ్మ, తారాబాయి, గణేశ్, మారుతి పాల్గొన్నారు.

## నేడు ఉట్నూర్‌కు ఐదుగురు మంత్రులు రాక



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, పోలీస్ అధికారులు

ఉట్నూర్, జూలై 10 : ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించే రైతు భరోసా పథకంపై రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. బుధవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను, ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు రైతు భరోసా పథకంపై అభిప్రాయాల సేకరణకై ఉమ్మడి జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని అభిప్రాయాలు తెలుపవచ్చన్నారు. వారి వెంట అదనపు ఎస్పీ సురేందర్ రావు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించాలి

ఇంద్రవెల్లి, జూలై 10: పిట్టబొంగురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పిడిస్తున్న నీటి సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, మాజీ జడ్పీటీసీ ఆర్కా పుష్పలత జిల్లా అధికారులను కోరారు. బుధవారం పాటగూడలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను ఎంపీడీవో భాస్కర్‌తో పాటు అధికారులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై ఆరాతీశారు. వారి వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## టీజీసీఏబీ చైర్మన్‌ను కలిసిన టీపీడీఎంఏ సభ్యులు



చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న వేముగంటి వరప్రసాద్‌రావ్

జైనథ్, జూలై 10 : తెలంగాణ కో ఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ మారినేని రవీందర్‌రావును టీపీడీఏ ఎంఏ సభ్యులు డాక్టర్ వేముగంటి వరప్రసాద్‌రావ్ వరంగల్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ అడ్మిషన్ల సమయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కళాశాలలోనే శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు జీరో అకౌంట్లు ఇస్తే స్కాలర్‌షిప్‌కు అదేవిధంగా బ్యాంక్‌కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు జీరో అకౌంట్లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి




మాట్లాడుతూన్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంతిపెల్లి దయాకర్

ఎదులాపురం, జూలై 10 : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంతిపెల్లి దయాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఫసల్ బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. రైతుభరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ఈ నెల 14వ తేదీ లోపు ఇన్సూరెన్స్ కంపెనీకి డబ్బులు చెల్లించడం సాధ్యం కానప్పటికీ ఈ విషయంలో రైతులకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షుడు జోగు రవి, రైతులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, జూలై 10 : టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) విభాగం ద్వారా మరింత ప్రజలకు సేవలు అందించాలని ఉద్దేశంతో కార్గో ఏజెంట్లను కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్గో మేనేజర్ ఎన్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాలోని మేజర్ గ్రామాల్లో కార్గో ఏజెంట్ల పాయింట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దరఖాస్తు పెట్టుకునే వారు ప్రస్తుతం షాపులో కంప్యూటర్, ప్రింటర్ పరికరాలు ఉండాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేంద్రంలో అయితే రూ.5వేలు; మండల కేంద్రం, గ్రామాల్లో రూ.1000 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలన్నారు. బుకింగ్ మీద 12 శాతం కమిషన్, రిసివింగ్ పార్శిల్ ఒక్కొదానికి హ్యాండ్లింగ్ చార్జీస్ రూ.10 ఉంటాయని అన్నారు. ఆసక్తి గల వారు సెల్ నంబర్లు 9154298553, 9154298541ను సంప్రదించాలని సూచించారు.



దస్తురాబాద్ : మొక్కలను నాటుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



భైంసాటౌన్: మొక్కలు నాటుతున్న సీఐ నైలు



సారంగాపూర్: అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద ..

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- వనమహోత్సవంలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



నేరడిగొండ : మొక్కలు నాటుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూలై 10 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా పాఠశాల విద్యార్థులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, మండల కన్వీనర్ శివారెడ్డి, ఎంపీడీవో రజ్వీర్, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావ్, ఏపీఎం ఉత్తమ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజ, పాఠశాల ఎస్‌వో రజిత, నాయకులు పాల్గొన్నారు.

బోథ్, జూలై 10 : సోనాల వివేకానంద పాఠశాల మైదానంలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాటౌన్, జూలై 10 : పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ నైలు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

దస్తురాబాద్,జూలై 10 : పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బాలికల గిరిజన పాఠశాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం లబ్ధిదారుడికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అనిల్ కుమార్, ఏపీవో రవిప్రసాద్, పంచాయతీ కార్యాదర్శి సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### చెట్లతోనే మనుగడ

సారంగాపూర్, జూలై 10: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. బుదవారం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మహా అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సముద్రాల రమణారావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, అడెల్లి వీడీసీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ), జూలై 10: వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని రామాలయంలో ఎస్ఐ హన్మాండ్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, ఏఎస్ఐలు దేవేందర్ గౌడ్, మాన్సింగ్ పాల్గొన్నారు.

సోన్, జూలై 10 : మొక్కలు నాటడమే కాదు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని సంరక్షించాలని సోన్ ఎస్ఐ గోపి అన్నారు. సోన్ మండలం గంజాల్ గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

## సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జూలై,10: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై మండల ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి పంచాయితీలకు జిల్లా యంత్రాంగానికి వారధిగా ప్రత్యేకాధికారులు పని చేయాలన్నారు. విధులపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల, ఉపాధి హామీ పనులు, వనమహోత్సవం వంటివి కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## గౌరాపూర్‌లో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, జూలై 10: మండలంలోని గౌరాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలోని నాలుగు ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసే స్థలాన్ని కలెక్టర్ రాజర్షి షా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 4వేల మొక్కలు నాటేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నాలుగు ఎకరాల్లో మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేయాలని డీఆర్డీవో సాయన్నను ఆదేశించారు. కార్యక్రమంలో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఎంపీవో జీవన్‌రెడ్డి, టీఏలు సంతోష్, మహేందర్, జాదవ్ విఠల్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఇచ్చోడ : మాట్లాడుతున్న బోథ్ డీఎల్‌పీవో జితేందర్

ఇచ్చోడ(సిరికొండ), జూలై 10 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని బోథ్ డీఎల్‌పీవో జితేందర్ అన్నారు. బుధవారం సిరికొండలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో ఎంపీవో సంతోష్ కుమార్, ఏపీవో భీంరావ్, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్, జూలై 10 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నయనత అన్నారు. బెల్గాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం ఉన్న రోగులకు రక్త నమూనాలు సేకరించారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

కుభీర్, జూలై 10 : వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలతో పాటు వర్షపు నీటితో నిండిన కులాయిలు, టైర్లు, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఎంపీవో గోవర్ధన్ అవగాహన కల్పించారు. బుధవారం కుభీర్‌లోని ఆయా కాలనీలలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పర్యటించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న కులాయిల్లోని నీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సత్యశీల, యశోద, విజయ, గాయత్రి, కృష్ణవేణి ఉన్నారు.

## ఆర్టీసీ డిపో ఎదుట నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

ఎదులాపురం, జూలై 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపెల్లి భీమ్‌రావు అన్నారు. జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. హిట్ అండ్ రన్ పేరిట తీసుకొచ్చిన చట్టాలు డ్రైవర్లకు ఉరితాళ్లుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షుడు భీమ్‌రావు, డిపో కార్యదర్శి ఆశన్న, ఊశన్న, నయమతుల్లా పాల్గొన్నారు.

## పునరావాస కుటుంబాలను ఆదుకుంటాం

ఉట్నూర్, జూలై 10: కవ్వాల్ టైగర్ రిజర్వ్ పునరావాస కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని ఆమె నివాసంలో కొత్త మద్దిపడగ పునరావాస గ్రామానికి చెందిన ఆదివాసులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేసేలా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కుంటాల, జూలై10: విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటగది, భోజనం గదులు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

తాంసి, జూలై 10 : విద్యార్థులకు విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, హాజరుపై వివరాలు ఆరా తీశారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

భైంసా, జూలై 10 : పట్టణంలోని అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన దుకాణాల్లో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజిలెన్స్ ఎస్పీ అచ్చేశ్వర్ రావు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి వద్ద 40 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం ఉండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అనిల్ కుమార్, వరుణ్ ప్రసాద్, ప్రశాంత్, దినేశ్ చంద్ర తదితరులు ఉన్నారు.

## బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్‌కు వినతి

ఎదులాపురం, జూలై 10 : ఆదిలాబాద్ జిల్లాలోని మండల నోడల్ అధికారులకు మండల విద్యాధికారి బాధ్యతలు అప్పగించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని ఎంఈవోలకు ఒకటి కంటే ఎక్కువ మండలాలు ఇన్‌చార్జి ఉండడంతో పని భారం ఎక్కువ అవుతుందన్నారు.

## బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

కుభీర్, జూలై 10 : హల్ద గ్రామానికి చెందిన మీసాల రాజన్న (80) క్యాన్సర్‌తో బాధ పడుతూ మద్యానికి బానిసై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ప్రతి రోజూ మాదిరిగానే మంగళవారం వృత్తిరీత్యా వడ్రంగి అయిన రాజన్న ఇంట్లో చెప్పి వడ్రంగి పని చేసేందుకని బయటకు వెళ్లాడు. ఆయన ఎంత సేపటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. రాత్రి అయిన ఇంటికి రాలేదు. బుధవారం గ్రామంలోని పాడుబడ్డ బావిలో దూకినట్లు చెప్పులు, కళ్లజోడు, బనియన్ ఆధారంగా గుర్తించారు. బావిలో నుండి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కూతురు ఇందిరాల రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జీవన్‌రెడ్డి సేవలు అభినందనీయం



జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్

సోన్, జూలై 10 : సోన్ జడ్పీటీసీగా జీవన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి, మాజీ మండలాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ దంపతులు కొనియాడారు. బుధవారం నిర్మల్‌లోని ఇందిరానగర్‌లోని చైర్‌పర్సన్ నివాసంలో జీవన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఫణిందర్‌రావు, నాయకులు రఫీ పాల్గొన్నారు.

## అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్, జూలై 10 : గ్రామాల్లో అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అన్నారు. బుధవారం సారంగాపూర్‌లోని పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో అంటువ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెల్త్‌సూపర్ వైజర్లు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పని తీరును పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపవైద్యాధికారి రాజేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, సరస్వతి పాల్గొన్నారు.

## విద్యుత్‌పై అవగాహన సదస్సు

ఇచ్చోడ, జూలై 10 : ముక్రా(కే) గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ ప్రభాకర్ రావ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కరెంట్ మీటర్ ఉండాలన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వస్తుందన్నారు. ఎవరు కూడా కొండీలు వేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీ విజయ సారథి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, విజిలెన్స్ ఏఈలు రవీందర్, యోగేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దవాఖానలో పాము కలకలం

కుంటాల, జూలై 10 : కుంటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కింద చుట్టుకొని ఉన్న పామును సిబ్బంది గమనించారు. దీంతో డ్యూటీలో ఉన్న సిబ్బంది భయంతో బయటకు వెళ్లిపోయారు. వెంటనే కర్రతో పామును చంపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత దవాఖాన భవనంలోకి వర్షపు నీరు ప్రవహించిందని, కిటికీలు, తలుపులకు సందులు ఉండడంతో వాటి నుంచి కూడా వచ్చి ఉండొచ్చని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

## విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్




కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, జూలై 10: విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్ ఉందని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. నిర్మల్‌లోని వాసవి వరల్డ్ స్కూల్‌లో బుధవారం స్టూడెంట్స్ ఇన్‌వెస్టీచర్ సెర్మనీ జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని చేరే వరకు కష్టపడాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన విద్యార్థులకు బ్యాడ్జ్, క్యాప్, చెస్ట్‌బాండ్‌లను డీఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శైలజా యసన్, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుంటాల మండల ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్

కుంటాల, జూలై 10 : కుంటాల మండల ప్రత్యేకాధికారిగా డీపీవో శ్రీనివాస్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రహీం, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ముథోల్, జూలై 10 : ముథోల్‌లోని ప్రతి రైతు తమ సర్వే నంబరు వారీగా తప్పనిసరిగా పంటల వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈవో ప్రవీణ్ సూచించారు. బుధవారం ముథోల్‌లోని పలు వ్యవసాయ క్షేత్రాలలో గల సోయా పంటలను పరిశీలించారు. పంటలను నమోదు చేసుకున్నట్లు వివరించారు. దీని వల్ల ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర దక్కుతుందని తెలిపారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పెంబి, జూలై 10: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ 24 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం వనమోహాత్సవం కార్యక్రమంలో భాగంగా తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో మొక్కలు నాటారు. భీమన్న చెరువుకు సాగునీరందే ప్రధాన కాలువ తెగిపోవడంతో మరమ్మతులు చేయించాలని, డీ–28 కాలువ మరమ్మతులు చేయించి సాగు నీరందించాలని పెంబి గ్రామ రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, నాయకులు స్వప్నిల్ రెడ్డి, తులాల శంకర్, పుప్పాల శంకర్, ఆశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇప్పించాలి

కడెం, జూలై 10 : 61 సంవత్సరాలకు పైబడిన వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇప్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కి వీఆర్‌ఏల వారసులు కోరారు. బుధవారం కడెంకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేకి వీఆర్‌ఏల వారసులు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, వీఆర్‌ఏల వారసులు ఉన్నారు.

## రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

బోథ్, జూలై 10 : బోథ్ నియోజకవర్గ కేంద్రంలో రూ .30 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్ అన్నారు. బుధవారం సాయినగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో కల్వర్టు, 14, 15 బ్లాకుల్లో హనుమాన్ మందిరాల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో ఫీవర్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

సోన్, జూలై 10 : నిర్మల్‌లోని సోఫినగర్‌లో గల సోన్ కేజీబీవీని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ప్రతి విద్యార్థికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వైద్య పరీక్షలు చేయాలని వైద్యులకు సూచించారు. ఫీవర్ సర్వేకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం తరగతి గదిని సందర్శించారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్ పాఠాలు బోధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, కేజీబీవీ నోడల్ అధికారి సలోనికరుణ, ప్రత్యేకాధికారి, విద్యార్థినులు ఉన్నారు.

## విరివిగా మొక్కలు నాటాలి

నిర్మల్ చైన్‌గేట్, జూలై 10: వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వనమహోత్సవ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థలు, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్, రహదారులు, ప్రాజెక్టుల కాలువల వెంబడి మొక్కలు నాటాలన్నారు. అన్ని శాఖల కార్యాలయాల సమన్వయంతో వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలోఅటవీ శాఖ అధికారి అరవింద్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవోలు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

భైంసా, జూలై 10 : ఆశ కార్యకర్తలకు కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి లలిత మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోశెట్టి, ఆశ వర్కర్ యూనియన్ ముథోల్ నియోజకవర్గ అధ్యక్షురాలు విజయ, సరిత, నంద, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు వ్యాలిడ్ పత్రాలు కలిగి ఉండాలి

కుంటాల, జూలై 10: ఆటో, టాటా మ్యాజిక్, టాటాఏస్ వాహనదారులకు మండలంలో వాహనాలు సక్రమంగా నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని కుంటాల ఎస్ఐ రజనీకాంత్ అన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, సరైన పత్రాలు కలిగి ఉండాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త చట్ట నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాందాస్, శంకర్, మనోహర్, రంజిత్‌కుమార్, బాజీసింగ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

దిలావర్‌పూర్, జూలై 10 : నేరాలను నివారించేందుకు గాను సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని నిర్మల్ గ్రామీణ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిర్గాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, దాని ఉపయోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్ఐ రాజేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సాయరెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

ఎదులాపురం, జూలై 10 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై డీఆర్డీవో అధికారులు ప్రజావేదిక నిర్వహించారు. బుధవారం మావల మండల పరిషత్ కార్యాలయంలో మావల, బట్టిసావర్గాం, వాఘాపూర్ పంచాయతీల్లో 2023–24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై అదనపు డీఆర్డీవో కుటుంబరావు విచారణ చేశారు. రూ.95లక్షలు విలువైన పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కొలతల్లో తేడా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు ప్రదీప్‌కుమార్, వీణ, మండల ప్రత్యేక అధికారి రాజలింగు, ఎంపీడీవో శంకర్, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాలు నాణ్యతగా ఉండాలి

నిర్మల్ చైన్‌గేట్, జూలై,10: ఆహారభద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పాల నాణ్యత ఉంచాలని విజయ డెయిరీ డీడీ మధుసూదన్ అన్నారు. సోఫినగర్‌లోని విజయ డెయిరీలో కడెం, నిర్మల్, దహెగాం, పాల కేంద్రాల క్షేత్ర స్థాయి సిబ్బందికి పాల నాణ్యత భద్రతపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి 12 లక్షల వ్యాపారం చేసే సంస్థలన్నీ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందన్నారు. పాల నాణ్యతపై నిర్మల్ డెయిరీ మేనేజర్ దస్రునాయక్ వివరించారు. కార్యక్రమంలో మేనేజర్లు గజారాం, వెంకటస్వామి, సాయన్న, క్షేత్ర పర్యవేక్షకులు పాల్గొన్నారు.